

7న ఆలయాల మూసివేత

జలుమూరు/పాతపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయాన్ని గ్రహణం సందర్భంగా ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు మూసివేస్తున్నట్లు ఈవో టి.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీముఖలింగంలోని మధుకేశ్వరస్వామి ఆలయంతోపాటు భీమేశ్వర, సోమేశ్వరాలయాలు, పాతపట్నంలోని శ్రీనీలమణిదుర్గ ఆలయం కూడా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 7గంటల నుంచి దైవదర్శనానికి భక్తులను ఆలయాల్లోకి అనుమతిస్తామని ఈవో వాసుదేవరావు తెలిపారు.

బోధనలో ముగ్గురూ.. ముగ్గురే!

● రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతల విజయ ప్రస్థానం

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయినులు తిమ్మరాజు నీరజ, కూర్మాన అరుణకుమారి, బూరవల్లి విజయభారతి ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వీరు అవార్డులను అందుకోనున్నారు. కాగా.. బోధనలో వారి ప్రత్యేకత, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వారి కృషి ఎనలేనది. వినూత్న పద్ధతులతో బోధన అవలంభిస్తూ.. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి విజయ ప్రస్థానం గురించి ప్రత్యేక కథనం.



బొమ్మలతో బోధిస్తున్న అరుణకుమారి (ఫైల్)



బోధిస్తున్న నీరజ (ఫైల్)

బట్టీ విధానానికి స్వస్తి..

● సృజనాత్మకకు అరుణకుమారి ప్రాధాన్యం

జి.సిగడాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమయపాలన, క్రమశిక్షణకు ఆమె మారుపేరు. అవార్డులు, డాక్టరేట్‌లు ఆమె సొంతం. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లోని వివిధ శిక్షణా కార్యక్రమాల్లో దిట్ట. బట్టీ విధానానికి స్వస్తి చెప్పి.. ఉపకరణాలు, బొమ్మల ఆధారంగా సృజనాత్మకత బోధనలో ఆమెకు ఆమే సాటి. ఇదీ జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని కూర్మాన అరుణకుమారి ప్రత్యేకత. ఈమె వినూత్న బోధనతో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నారు. బట్టీ విధానంలో విద్యార్థులు చదివితే పెద్దగా గుర్తుండదు. అందుకే పాటాలు, నృత్యాలు, టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ సహకారంతో అభినయం, నాటకీకరణ, వర్కింగ్ మోడల్స్ ద్వారా బోధిస్తే సులువుగా అర్థమవుతుందని ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి ఆచరణలో నిరూపించారు. పనికిరాని **(మిగతా 5వ పేజీలో..)**

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

● ప్రాజెక్టులతో ఆసక్తి పెంచిన విజయభారతి



నేలబొంతు పాఠశాలలో బోధిస్తున్న విజయభారతి (ఫైల్)

మెళియాపుట్టి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడంలో ఆమె కృషి ఎనలేనిది. చదువులో వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకువచ్చేలా వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం)ను వినియోగించి కొత్త విషయాలపై అవగాహన కల్పించేలా బోధన సాగిస్తున్నారు. ఫిజిక్స్ అంటే విద్యార్థులకు భయం పోగొట్టి.. ఆసక్తి పెంచేలా ప్రాజెక్టుల ద్వారా బోధన చేపడుతున్నారు. ఇదీ మెళియాపుట్టి మండలం నేలబొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరవల్లి విజయభారతి ప్రత్యేకత. ఈమె 2001లో మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురంలోని గిరిజన సంక్షేమశాఖ బాలుర పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలిగా చేరారు. ప్రస్తుతం నేలబొంతు ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్నారు. గిరిజన విద్యార్థులకు అండగా నిలుస్తూ.. వారి అవసరాలు తీరుస్తున్నారు. వారికి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. డ్రాపౌట్స్ విద్యార్థులను ఆశ్రమ పాఠశాలలో చేర్పించేందుకు తనవంతు కృషి చేశారు. విద్యార్థులకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పిస్తున్నారు. 9వ తరగతి సైన్స్ టెక్స్‌బుక్‌లో పాఠ్యాంశం రాయడంలో కీలకపాత్ర పోషించారు. విద్యార్థులతో ప్రాజెక్టులు రూపొందించి.. వాటి ద్వారా మెరుగైన బోధన చేపడుతున్నారు. ఈ క్రమంలో గత రెండేళ్ల నుంచి ఈ పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

నా బాధ్యతను నిర్వర్తిస్తున్నాను..

ఉద్యోగ బాధ్యతను నేను నిర్వర్తిస్తున్నాను. ఏనాడు అవార్డుల కోసం బోధన చేపట్టలేదు. విద్యార్థుల ఉన్నతి కోసం పనిచేశాను. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మా నాన్న త్రినాథరావు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. మా తల్లి పద్మావతి కూడా ఉన్నత విద్యావంతురాలు. చిన్నప్పటి నుంచీ క్రమశిక్షణ అల వాటైంది. గతేడాది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకున్నాను.

- విజయభారతి, ప్రధానోపాధ్యాయురాలు, నేలబొంతు

సులభ పద్ధతిలో హిందీ

● ఇదీ తిమ్మరాజు నీరజ ఘనత

శ్రీకాకుళం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆమె పేరు తెలియనివారు లేరు. ఇప్పటికే ఆమె చాలా రికార్డులను సొంతం చేసుకున్నారు. గిన్నిస్‌బుక్‌లో కూడా చోటు సంపాదించారు. కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ చూపుతూనే.. ఉపాధ్యాయురాలిగా కూడా రాణిస్తున్నారు. విద్యార్థులకు హిందీని సులభ పద్ధతిలో బోధిస్తూ.. శతశాతం ఫలితాల సాధనలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇదీ శ్రీకాకుళం నగరంలోని అంధవరపు వరం మునిసి పల్ ఉన్నత పాఠశాల(ఏవీఎస్ ఎంహెచ్)లో హిందీ పండితురాలు తిమ్మరాజు నీరజ ఘనత. ఈమె జిల్లావాసులకు నీరజా సుబ్రహ్మణ్యంగా సుపరిచితురాలు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఈమె 2002 డీఎస్సీలో గ్రేడ్2 హిందీ పండిట్‌గా కొలువు సాధించి.. ప్రియాగ్రహారంలో విధుల్లో చేరారు. 2007లో శ్రీకాకుళం మునిసిపల్ పరిధి పాఠశాలకు బదిలీపై వచ్చారు. 2012లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. 2007 నుంచి ఈ ఏడాది జూన్ వరకు టీపీఎంహెచ్ స్కూల్‌లో పనిచేశారు. ప్రస్తుతం ఏవీఎస్ ఎంహెచ్ స్కూల్‌లో విధులు నిర్వరిస్తు న్నారు. విద్యార్థులకు హిందీ భాషపై భయాన్ని పోగొట్టేలా వినూత్నంగా పాఠా లను నేర్పించారు. హిందీ భాషను సులభంగా నేర్చుకునేలా తరగతి గదిలో పాఠా లను ఇన్నోవేటివ్‌గా వివరించడం ఆమె ప్రత్యేకం. పాటల రూపంలోనూ.. నృత్యాల రూపంలోనూ.. అంత్యాక్షరి వంటి ఆటల రూపంలో సృజనాత్మకంగా హిందీ భాషను విద్యార్థులో మెదడులోకి ఎక్కించి.. శతశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేశారు. ఆమె 2004లో విధులు నిర్వహిస్తున్న చోట శతశాతం ఉత్తీర్ణత లభించ డంతో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా అందుకున్నారు. ఏటా హిందీ సబ్జెక్ట్‌లో నూరుశాతం ఫలితం సాధించడమన్నది.. ఆమె ఉపాధ్యాయ వృత్తి పట్ల నిబద్ధతను తెలియజేస్తోంది. ఈమెకు కూచిపూడి నృత్యం అంటే మక్కువ. అందులో అద్భుత ప్రతిభ చాటారు. సొంతంగా శిష్య బృందాన్ని తీర్చిదిద్ది.. దేశ, రాష్ట్రస్థాయిల్లో ప్రదర్శనలు ఇచ్చి.. గిన్నిస్ బుక్‌లో కూడా చోటు సాధించారు. తాజాగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● **భాషపై మక్కువతో నేర్పించా..**

విద్యార్థులకు ముందుగా హిందీపై భయాన్ని తొలగించి.. భాషపై పట్టు పెరిగేలా.. ఆసక్తి కలిగేలా కొంత సృజన్మాతకత జోడించాను. కేవలం బోర్డుపై పాఠాల మాదిరిగానే కాకుండా.. బొమ్మల రూపంలోనూ.. ఆటల్లో.. పాటల్లో పిల్లలకు నేర్పించాను. దీంతో ఇతర సబ్జెక్టుల మాదిరిగానే హిందీలో కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించగలిగారు. ఉత్తమ ఉపాధ్యాయరాలిగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది.

- తిమ్మరాజు నీరజ, హిందీ పండితురాలు, శ్రీకాకుళం

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా నలుగురి ఎంపిక



జనార్దనరావు, పూజారి వెంకట్ యశ్వంత్

గుజరాతీపేట/ సంతబొమ్మాళి/ ఆమదాలవలస, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. వీరికి విజయవాడ వేదిక శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ విభాగాధిపతి ఆర్‌డీఎల్‌పీ క్రిస్టియన్, ఎలక్ట్రానిక్స్. ఇన్‌స్ట్రు మెంటేషన్ విభాగంలో పనిచేస్తున్న సుధారమ్య కార్రి ఉత్తమ అధ్యాప కులుగా ఎంపికయ్యారు.


● అలాగే సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు ఆర్. జనార్దనరావు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల కోసం గత పదేళ్లుగా స్టడీ మెటీరియల్‌తో పాటు ప్రాక్టికల్స్ కోసం ప్రయోగ దీపిక తయారు చేసి అందజేస్తున్నారు. జనార్దనరావును కళాశాల అధ్యాపక బృందంతో పాటు నౌపడ గ్రామస్థులు అభినందించారు.

ఆమదాలవలసకు చెందిన డాక్టర్ పూజారి వెంకట యశ్వంత్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. యశ్వంత్ 2013 నుంచి 2022 వరకు ఆమదాలవలసలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో లెక్చరర్‌గా సేవలందించారు. ప్రస్తుతం పార్వతీపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. తాను అవార్డుకు ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నానని యశ్వంత్ తెలిపారు.

60 మంది ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ పురస్కారాలు

● నేడు అంబేడ్కర్ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానం

గుజరాతీపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ కేటగిరిల్లో 60మంది ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ పురస్కారాలు ఇవ్వనున్నట్లు డీఈవో ఎ.రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్టు వెల్లడించారు. ఉపాధ్యాయులను హెచ్.ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలుగా విభజించి.. ఉత్తమ బోధన చేపట్టిన వారిని ఎంపిక చేశామని తెలిపారు. ఆయా ఉపాధ్యాయులంతా శుక్రవారం ఉదయం 8 గంటలకు అంబేడ్కర్ ఆడిటోరియానికి హాజరుకావాలని సూచించారు.



మా మంచి మాస్టార్లు

● బోధనలో ఆ ఉపాధ్యాయులది ప్రత్యేక శైలి ● అంకితభావంతో గుర్తింపు ● పాఠశాలల అభివృద్ధిలోనూ కీలక పాత్ర

6లో

ప్రణాళిక ప్రకారమే.. కడతేర్చారా?

● వీడనున్న బంగారం వ్యాపారి మిస్సింగ్ కేసు మిస్టరీ
● పోలీసుల అదుపులో కారుడ్రైవర్, స్నేహితుడు
● మృతదేహం కోసం గాలింపు



వెంకట పార్వతీశం గుప్త (ఫైల్)

నరసన్నపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి(కొరియర్) పొట్నూరు వెంకట పార్వతీశం గుప్త మిస్సింగ్ కేసు మిస్టరీ వీడనుంది. బంగారం కొనుగోలు నిమిత్తం గత నెల 26న కారులో విశాఖ వెళ్లిన ఈయన అదృశ్యమైన సంగతి తెలిసిందే. దీనిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేసి గుప్త హత్యకు గురైనట్టు నిర్ధారణకు వచ్చారు. విశాఖలో గుప్త కొనుగోలు చేసిన రూ.2కోట్ల బంగారం బిస్కెట్లను తస్కరించేందుకు కారుడ్రైవర్ సంతోష్ పథకం రచించి.. పక్కా ప్రణాళిక కడతేర్చినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. విశ్వసనీయ సమచారం మేరకు.. గత నెల 26న విశాఖలో రూ.2కోట్ల విలువ చేసే బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి గుప్త, డ్రైవర్ సంతోష్ తిరుగుముఖం పట్టారు. పెద్దపాడు వద్ద కారులో సాంకేతికలోపం ఉందంటూ.. పాలశీతల కేంద్రం వద్ద సర్వీసురోడ్డులోకి రూట్ మార్చారు. అక్కడ ముందస్తు ప్రణాళిక ప్రకారం డ్రైవర్ సంతోష్.. తన స్నేహితుడైన ఒక కారు డెకార్ యాజమానితో గుప్తను హతమార్చి రూ.2కోట్లు విలువ చేసే బంగారం కాజేశారని తెలుస్తోంది. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా అదేరోజు రాత్రి గుప్త మృతదేహాన్ని పెద్దపాడు- శ్రీకాకుళం కొత్తరోడ్డు మధ్య ఒక కాలువలో పడేసి.. ఎటువంటి అనవాళ్లు దొరకుండా జాగ్రత్తపడ్డారని సమాచారం.

● **ఘటన తర్వాత.. తీర్థయాత్రలకు వెళ్లి..**

ఆ రోజు డ్రైవర్ సంతోష్ కారును గుప్త ఇంటికి అప్పగించిన తరువాత.. కాజేసిన బంగారంలో 14 గ్రాములు నరసన్నపేటలో ఒక బంగారం షాపు యాజమాని వద్ద తాకట్టు పెట్టి రూ.1.40లక్షలు తీసుకుని తీర్థయాత్రలకు వెళ్లారు. గుప్త మిస్సింగ్ అయిన నాలుగు రోజుల తర్వాత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నరసన్నపేట పోలీసులు రంగం లోకి దిగారు. కారుడ్రైవర్ సెల్‌ఫోన్ కాల్స్‌పై దృష్టి సారించారు. గుప్త ఫోన్ ఆర్టీసీ బస్సులో దొరికినట్టు, ఆ ఫోన్‌ను గుప్త కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనంపై పోలీసులు కూపీ లాగారు. ఈ వ్యవహారంలో ఇద్దరి పాత్ర ఉన్నట్టు నిర్ధారణకు వచ్చారు. టోల్‌గేట్ల వద్ద గుప్త ప్రయాణించే కారు సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ల సిగ్నల్స్‌ను పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో గుప్త పెద్దపాడు వరకు వచ్చినట్లు సాంకేతికంగా ఆధారాలు లభ్యం కావడంతో కేసును ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. కారుడ్రైవర్ సంతోష్‌ను, అతడి స్నేహితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు గుప్త మృతదేహం కోసం గాలిస్తున్నారు. గురువారం పాత్రునివలస వద్ద రెండు కాలువల్లో గాలింపు చేపట్టారు. జెమ్స్ ఆసుపత్రి సమీపంలో ఓ మృతదేహం బయటపడగా.. తొలుత అది గుప్తదేనని పోలీసులు భావించారు. కొద్ది సమయం తర్వాత గుప్త మృతదేహం కాదని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని, గుప్త మృతదేహం దొరికిన తర్వాత నిందితులను అరెస్టు చేస్తామని ఓ పోలీసు అధికారి తెలిపారు.

చిల్లంగి అనుమానంతోనే..

● కేశుపురంలో వృద్ధుడి హత్య
● ఎనిమిది మంది నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ, పోలీసులకు పట్టుబడిన నిందితులు

పలాస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిల్లంగి పెడుతున్నాడన్న అనుమానంతో పలాస మండలం కేశుపురం గ్రామానికి చెందిన వృద్ధుడు ఉంగ రాములను హత్య చేశారు. ఈ హత్యకేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ గురువారం విలేకరులకు వెల్లడించారు. గ్రామంలో పదేళ్లుగా జరుగుతున్న మరణాలకు రాములే కారణమని, ఆయన చిల్లంగి పెట్టి చంపుతున్నాడని అంబలి తులసీరావు కుటుంబ సభ్యులు ఎప్పటినుంచో అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో తులసీరావు వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అది చిల్లంగి అన్న అనుమానంతో సంతబొమ్మాళి మండలం బోరుభద్ర నుంచి పొందూరు గణపతిరావు అనే రెయ్యమ్మ దాసుడ్ని తీసుకొచ్చి వారి ఇంట్లో ఈనెల 2న రాత్రి పూజలు నిర్వహించారు. తులసీరావుకు గ్రామానికి వాయువ్య దిశలో ఉన్నవారే చిల్లంగి పెట్టారని దాసుడు చెప్పాడు. దీంతో చిల్లంగి పెట్టింది ఉంగ రాములేనని తులసీరావు కుటుంబ సభ్యులు అనుమానం పెంచుకున్నారు. ఆ రోజు రాత్రి 10.30 గంటల తర్వాత గ్రామపెద్దవీధిలో నివాసముంటున్న ఉంగ రాములు ఇంటికి అంబాల తులసీరావు, శేరిపల్లి రాజ్‌కుమార్, అంబాల చంద్రశేఖర్, అంబాల భీమారావు, బుడ్డ తేజేశ్వరరావు, బుడ్డ లక్ష్మీకాంత్, కోనారి సూర్యనారాయణ, అంబల వెంకటలక్ష్మి వెళ్లారు. ముందుగా రెండు బకెట్లతో పసుపునీరు పోసి భయోత్పాతాన్ని సృష్టించారు. నిద్రిస్తున్న రాములను ఆరుబయటకు తీసుకువచ్చి తమ మనిషికే చిల్లంగి పెట్టి పిచ్చివాడ్ని చేస్తావా? అంటూ కర్రతో చావబాదారు. తులసీరావు పక్కనే ఉన్న రాయితో రాములుపై బలంగా కొట్టడంతో మిగిలిన వారు కూడా కర్ర, రాయితో దాడి చేశారు. విషయాన్ని గుర్తించిన రాములు మనమడు చరణ్‌కుమార్ వారిని వారించాడు. రాములు మృతి చెందినట్లు ధ్రువీకరించుకుని వారంతా వెళ్లిపోయారు. అనంతరం చరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేసి గురువారం 8 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసునకు సంబంధించి దాసుడు పొందూరు గణపతిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉంది. ఆయన ఇచ్చిన సూచనల మేరకే రాములు హత్య జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కాగా రెయ్యమ్మ దాసుడ్ని ఈ కేసు నుంచి తప్పించడానికి కొంతమంది రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.



దాడికి వినియోగించిన కర్ర, రాళ్లు

చేతబడిపై ప్రచారం చేస్తే చర్యలు

చేతబడి, చిల్లంగి పేరుతో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ హెచ్చరించారు. గురువారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో ప్రజలు మూఢనమ్మకాలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అటువంటి గ్రామాల్లో ప్రజలకు చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో ఇటువంటి మూఢవిశ్వాసాలకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆక్షేపించారు. సమావేశంలో ఎస్ఐ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఉర్లాం వీఏఏ సస్పెన్షన్

● ఎరువుల పేరిట రైతుల నుంచి రూ.2 లక్షల వసూలు

నరసన్నపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉర్లాం సచివాలయ వ్యవసాయ అధికారి (వీఏఏ) గొల్లపల్లి భాస్కరరావుకు సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉర్లాం సచివాలయ పరిధిలోగల గ్రామాల్లో యూరియా, డీఏపీ ఇస్తామని రైతుల నుంచి సుమారు రూ.2 లక్షలు వసూలు చేశారు. ఈవ్యవహారంపై రైతులు ఆందోళనతో ఏడీ వెంకటమధు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు ఇచ్చిన విషయం విదితమే. ఈ మేరకు స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి.. విధుల నుంచి భాస్కరరావును తప్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే ఆగస్టు నెలకు సంబంధించి కొందరి పింఛన్ల సొమ్మును కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా కాజేసినట్లు బాధితులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ అవార్డులకు ఎంపిక

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా, రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర-2025 అవార్డుల కోసం ఎంపిక ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలు, వసతిగృహాలు, ఆసుపత్రులు, బస్‌స్టేషన్లు, రైతుబజార్లు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు) తదితర సంస్థల్లో స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని నింపేందుకు ఈ అవార్డులు ఇవ్వడం జరుగు తుందన్నారు. స్వచ్ఛాంధ్ర, శాఖపరమైన నివేదికలు, థర్డ్‌పార్టీ నివేదికల ద్వారా ఈ ఎంపికలు పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.



ప్రదీప్‌రెడ్డి (ఫైల్)

గురుపూజోత్సవానికి వెళ్లి..

● అస్వస్థతకు గురై విద్యార్థి మృతి

భారీగా గంజాయి స్వాధీనం

● వేర్వేరు ఘటనల్లో 42.5 కిలోలు పట్టివేత

రచ్చకెక్కిన గ్రామ కమిటీ నిధుల వివాదం

4లో

ఆలయాల పాలకమండళ్ల ప్రమాణ స్వీకారం

5లో

దుబాయ్‌లో చిక్కుకున్న వారిని తీసుకురండి

● ఎమ్మెల్యేకి బాధిత కుటుంబ సభ్యుల మొర

5లో

గురుపూజోత్సవానికి వెళ్లి..

● అస్వస్థతకు గురై విద్యార్థి మృతి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థులతో ఆడుతూ పాడుతూ ఒక్కసారి కుప్పకూలి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన నగరంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కృష్ణాపార్క్ వద్ద నివాసం ఉంటున్న నిమ్మ ప్రదీప్‌రెడ్డి(18) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా తయారై కళాశాలకు వెళ్లాడు. కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని తోటి విద్యార్థులు యాజమాన్యానికి, అధ్యాపకులకు తెలిపారు. వారు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే ప్రదీప్ ఫిట్స్ వ్యాధితో బాధప డుతున్నాడు. బెంగళూరు తరచూ వెళ్లి చికిత్స తీసుకుంటున్నాడు. ప్రదీప్‌రెడ్డి తల్లి దండ్రులు కృష్ణాపార్క్ వద్ద తినుబండారాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాస్ మృతదేహం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి చిన్నబమ్మిడి జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార మండలం, శ్రీకూర్మం గ్రామానికి చెందిన జగలింగ శ్రీనివాస్(39) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాస్ మానసిక వికలాంగుడని, గత కొన్నేళ్లుగా నిమ్మాడ, నిమ్మాడ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుంటాడు. ఈ క్రమంలో గురువారం చిన్నబమ్మిడి జంక్షన్ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ చిన్నతనంలో తండ్రి అప్పన్న నిమ్మాడ వసతి గృహంలో వంటివాడిగా పనిచేసేవాడు. అప్పట్లో నిమ్మాడలోనే కుటుంబ సభ్యులతో కలిసి అద్దెఇంట్లో ఉండేవారు. అప్పన్నకు బదిలీ కావడంతో శ్రీనివాస్ కూడా కుటుంబంతో కలిసి వెళ్లిపోయాడు. అయితే కొన్నేళ్ల కిందట శ్రీనివాస్ నిమ్మాడకు వచ్చి ఈ పరిసరాల్లో తిరుతున్నాడు. లారీ డ్రైవర్ ఢీకొట్టి పరారుకావడంతో స్థానికులు సమాచారం మేరకు లారీని గుర్తించినట్టు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వంగపండు సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

ఎచ్చెర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంతశీతారాంపురం గ్రామ సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన బస్వా పార్వతి(49) తీవ్రంగా గాయ పడి శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చర్మవ్యాధితో బాధపడుతున్న పార్వతి తన కుమారుడు రామిరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంతో కుప్పిలి, సంతశీతారాంపురం మీదుగా శ్రీకాకుళం నగరంలోని ఆసుపత్రికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బైక్ వెనుక భాగంలో కూర్చొన్న పార్వతికి ఒక్కసారిగా కళ్లు తిరగడంతో రామి రెడ్డిని గట్టిగా పట్టుకోవడంతో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను 108లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. స్వల్పగాయాలతో బయటపడిన రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ-2 అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాటలో గాయపడిన వృద్ధురాలు..

ఆమదాలవలస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తవలస గ్రామంలో జరిగిన కొట్లాటలో గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ అరసవిల్లి హరమ్మ (60) గురువారం మృతి చెందింది. గ్రామంలో ఇరువర్గాల మధ్య బుధవారం ఉదయం కొట్లాట జరగ్గా తీవ్రంగా గాయపడిన హరమ్మను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందిందని పోలీసులు తెలిపారు. మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు.

మాజీ ఎంపీటీసీ..



బాలరాజు (ఫైల్)

నందిగాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు బొద్దంకి బాలరాజు (60) మృతిచెందారు అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం మద్దిలివానిపేట గ్రామంలో గురువారం తెల్లవారు జామున కన్నుమూశారు. 2001 నుంచి 2006 మధ్య ఎంపీటీసీగా కొనసాగారు. భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు వివాహిత కుమార్తెలు ఉన్నారు. బాలరాజు మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వసప గ్రామానికి చెందిన కలగాటి రవి(38) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ రాజేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. మద్యానికి బానిసైన రవి బుధవారం తండ్రి నుంచి డబ్బులు రాబట్టేందుకు గడ్డిమందు తాగేస్తానని బెదిరించి పొరపాటున తాగేశాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన రవిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రవి తండ్రి కాకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు జెమ్స్ వైద్య కళాశాల మార్గంలో చెరువులో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికుల ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెక్నాలజీ సాయంతో చోరీని ఛేదించాం

పొందూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ సాయంతో చోరీకి గురైన నాలుగు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. గురువారం పొందూరు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. బైక్‌లు చోరీకి గురైనట్టు అందిన ఫిర్యాదు మేరకు సాంకేతికతను వినియోగించుకుని పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బందితో కలిసి చోరీకి గురైన వాహనాలు వినియోగిస్తున్నవారిని గుర్తించి ఆరా తీశారు. మూడు బైక్‌లు ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న బొమ్మలాట మోహ నరావు, ఒక బైక్ బొమ్మలాట ఢిల్లీ, ఆటోను తోట శ్రీను చోరీ చేసినట్లు గుర్తించారు. ప్రస్తుతం వాహనాలను బొమ్మలాట ఢిల్లీ నుంచి స్వాధీనం చేసుకున్నారు. చోరీని ఛేదించడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ సత్యనారాయణను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. త్వరలోనే రివార్డు ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ సత్యనారాయణ, మోహిని తదితరులు పాల్గొన్నారు.

కిల్లోయిలో దొంగల హల్‌చల్

● రెండు చోట్ల చోరీ

హరిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మందస మండలం ఏజెన్సీ ప్రాంతంలోని కిల్లోయి గ్రామంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒక కిరాణా దుకాణం, ఒక మినీ ఏటీఎంలో చోరీకి పాల్పడ్డారు. నల్ల శంకరరావు కిరణాదుకాణం పెట్టి జీవనం సాగిస్తుండగా.. నాగ రమేష్ ఏపీజీవీబీ మినీ ఏటీఎం ఏర్పాటు చేసి జీవనం పొందుతున్నారు. రాత్రి దుకాణం తలుపులు వేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లేసరికి తలుపులు తెరిచి ఉండడంతో లబోదిబోమన్నారు. కిరణా దుకాణంలో ఉంచిన సుమారు రూ.లక్ష నగదు, మినీ బ్యాంకు ఏటీఎంలో రూ.30వేలు నగదు, వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీకిగురయ్యాయి. సమాచారం అందుకున్న మందస ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించి క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

● వేర్వేరు ఘటనల్లో 42.5 కిలోలు పట్టివేత

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురం పోలీసులు 21 కిలోలు, పలాస పోలీసులు 16.5 కిలోలు, రైల్వే, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఐదు కిలోల చొప్పున మొత్తం 42.5 కిలోల గంజాయిని పట్టుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయిడు



మాట్లాడుతున్న కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ

ఒడిశా టు గుజరాత్

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి గుజరాత్‌కు అక్రమం గా తరలిస్తున్న 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మీసాల చిన్నంనాయిడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొడల గ్రామానికి చెందిన సాగర్ బెహరా, తనకు పరిచయమైన వ్యాపారి సమీర్ సాహు నుంచి గంజాయి కొనుగోలు చేశాడు. ఒడిశా రాష్ట్రం పీతల గ్రామానికి చెందిన రాజేష్‌తో గంజాయిని తరలిస్తుండగా కవిటి మండలం కొజ్జిరియా ఫ్లైఓవర్ వద్ద కవిటి ఎస్ఐ రవివర్మ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి నుంచి 21కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరు గుజరాత్‌లోని ఒక స్పిన్నింగ్ మిల్‌లో పనిచేస్తున్నారన్నారు. సమావేశంలో కవిటి ఎస్ఐ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

కేరళకు తరలిస్తూ..

పలాస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రానికి 16.5 కిలోల గంజాయి తరలిస్తూ ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. గురువారం కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన గంజాయి సాగుచేసే రైతు ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తే అధిక మొత్తంలో డబ్బులు ఇస్తానని అదే రాష్ట్రం గజపతి జిల్లా తబరాడ గ్రామానికి చెందిన అరబింద్ ఆనంద్‌కు చెప్పాడు. ఈ క్రమంలో కేరళ రాష్ట్రంలో ఓ బ్రోకరకు 16.5 కిలోల గంజాయి అందించాలని కోరాడు. దీంతో అదే గ్రామానికి చెందిన అవినాష్ రైతా, కృష్ణచంద్రపూర్ గ్రామానికి చెందిన మటిలాల్ లిమా (మహిళ)తో కలిసి అరబింద్ ఆనంద్ బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై గంజాయితో పలాస రైల్వేస్టేషన్‌కు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరిని అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు. వీరికి సహకారం అందించిన రైతు, బ్రోకర్ల కోసం వెతుకుతున్నారు. ఎస్ఐ నర్సింహమూర్తి, సిబ్బంది ఉన్నారు.

ఐదు కిలోలతో వ్యక్తి అరెస్టు

పలాస రైల్వే స్టేషన్ పరిసరాల్లో రైల్వే, ఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం సంయుక్తంగా తనిఖీలు హించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా బెహరా కామేశ్వరరావు అనే వ్యక్తి తిరుగుతుండగా, అతడ్ని తనిఖీ చేయగా ఐదు కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. మోహనరావు వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామస్థుడిగా పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రం మోహన ప్రాంతంలో భాను అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి ఈ ప్రాంతంలో అమ్ముతున్నట్టు గుర్తించారు. అతడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.





వణ్యప్రాణుల వేషధారణలో విద్యార్థులు

వణ్యప్రాణుల సంరక్షణకు కృషి

నందిగాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వణ్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలని పెద్దతామరాపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ హైమావతి విద్యార్థులకు సూచించారు. గురువారం జాతీయ వణ్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో వన్య ప్రాణుల వేషధారణలు వేయించారు. వన్యప్రాణులను వేటాడకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక శంకరరావు, డి.వనిత, దుర్యోధనరావు తదితరులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన గ్రామకమిటీ నిధుల వివాదం

సంతబొమ్మాళి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రామ అభివృద్ధి కమిటీ నిధుల వివాదం రచ్చకెక్కింది. గ్రామ పరిధిలోని తంపరలో చేపల వేట కట్టు ద్వారా ఏటా లక్షలాది రూపాయలు గ్రామాభివృద్ధి కమిటీకి చేరుతుంటాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉండడంతో ఆపార్టీకి చెందిన సర్పంచ్ జీరు బాబూరావు ఆధ్వర్యంలో ఈ నిధుల నిర్వహణ ఉండేది. అయితే కూటమి అధికారంలోకి రావడంతో గ్రామాభివృద్ధి నిధులు ఎంత ఉన్నాయి? ఎంత ఖర్చు చేశారు? వివరాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు జీరు భీమారావు, సుందరరావు, నారంనాయుడు ఆధ్వర్యంలో నౌపడ పోలీసులను ఆశ్రయించారు. ప్రతిరోజూ ఈ వివాదం జరుగుతుండంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు మంగి రామారావును తెచ్చేందుకు గ్రామానికి ఎస్ఐ నారాయణస్వామి గురువారం వెళ్లారు. దీనిపై సర్పంచ్ బాబూరావు సోదరుడు విశ్వనాథం ఎస్ఐను ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఎస్ఐ దాడి చేశాడంటూ చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రిలో విశ్వనాథం చేరాడు. విషయం తెలుసుకున్న టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పరామర్శించి ఎస్ఐ తీరుని ఖండించారు. ఈ వివాదంపై మూలపేటకు చెందిన ఇరువర్గాలు నౌపడ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దీనిపై నౌపడ ఎస్.ఐ నారాయణస్వామి మాట్లాడుతూ.. రోజూ గ్రామ కమిటీ వివాదం జరుగుతోందని, గొడవ సద్దుమణిగించేందుకు కమిటీ సభ్యున్ని తెచ్చేందుకు ఆ గ్రామానికి వెళ్లానని, తనపైనే విశ్వనాథం ఎదురు తిరగాడని, తాను ఎవరిపైనా దాడి చేయలేదని స్పష్టం చేశారు.

డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన

టెక్కలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మూలపేటకు చెందిన జీరు విశ్వనాథంపై నౌపడా ఎస్ఐ దాడి చేశారని వైసీపీ నాయకులతో పాటు ఆ గ్రామస్థులు గురువారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మూలపేట గ్రామంలో ఏ తగాదాకైనా పోలీసులే కారణమని, సమస్యలను ప్రశ్నించినందుకే విశ్వనాథంపై పోలీసులు దాడి చేశారని డీఎస్పీ లక్ష్మణరావు ముందు గ్రామస్థులు వాపోయారు. అనంతరం ఎస్ఐ నారాయణస్వామిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ నాయకులు పేడాడ తిలక్‌తో పాటు సర్పంచ్ జీరు బాబూరావు, నక్క భీమారావు, కెల్లి గోవింద్ తదితరులు డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. టెక్కలి అర్బన్, రూరల్ సీఐలు శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, పలువురు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

అధికారుల పనితీరుపై సభ్యుల ధ్వజం

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులపై పలువురు సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. వ్యవసాయశాఖాధికారి కె.సింహాచలం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలతోపాటు ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు సరఫరాపై మాట్లాడుతుండగా సర్పంచ్‌లు జి.యోగీశ్వరరావు, ఈగల చిన్నారావులతోపాటు మరికొంతమంది ఎరువుల సరఫరాలో ఇష్టారాజ్యంగా పంపిణీ జరగడంతో రైతులకు న్యాయం జరగలేదన్నారు. వ్యవసాయాధికారి ఇచ్చిన వివరణపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అలాగే పలు అంశాలపై చర్చించారు. శ్రీకాకుళం డివిజన్‌లోకి మండలాన్ని మార్పు చేయాలని, పలాస జిల్లా ఏర్పాటైతే శ్రీకాకుళం జిల్లాలోనే మండలాన్ని ఉంచాలని సభ్యులంతా తీర్మానం చేశారు. సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు, పశువైద్యాధికారి జి.కవిత, జడ్పీటీసీ కె.త్రినాథులు, ఏఎంసీ ఛైర్మన్ ఎం.రామకృష్ణ, మండల ప్రత్యేకాహ్వానితులు ఆర్.రామారావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌పై రాజకీయాలు చేయడం తగదు

పాతపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్‌పై రాజకీయాలు చేయడం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి తగదని టీడీపీ మండల అధ్యక్షుడు సైల బాబ్జీ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం చేరువలో జరుగుతున్న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ ప్రాంగణంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. అన్నాక్యాంటీన్ అక్రమనిర్మాణంగా ఆమెచేసిన ఆరోపణను ఖండించారు. పేదోడికి పట్టెడన్నం పెట్టాలనే తలంపుతో చేపట్టిన నిర్మాణాన్ని అడ్డుకోవడం ఆమె దిగజారుడి తనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్ని అనుమతులతో రూ.61లక్షల వ్యయంతో అన్నాక్యాంటీన్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైలాడ సతీష్ మడ్డు రామారావు, ఎ.సన్యాసిరావు, మంచు కృష్ణారావు, శ్రీరాం దుర్గా ప్రసాద్ బుద్దల నరేష్ కరకవలస మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్న రైతులు యూరియా వాడకం తగ్గించాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు అన్నారు. గురువారం జీయన్నపేట సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు తమ పరిధిలో గల గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ-పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపీటీసీ నంబాళ రాజశేఖర్, మాజీ జడ్పీటీసీ నంబాళ శ్రీనివాస్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ, సెప్టంబరు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి చినబడాంలో గల శ్రీకృష్ణ సాహితి ఇంగ్లిష్ మీడియం హై స్కూల్లో కరస్పాండెంట్ కవిటి భారతి ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనం గా నిర్వహించారు. సెప్టంబరు 5 టీచర్స్‌డే పురస్కరించుకుని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రద ర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు కవిటి రేణు కేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.భాస్కరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌లో నీరు



ఆందోళన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతబస్టాండ్‌లో గల ఓ పెట్రోల్ బంకు వద్ద రెడ్డికపేటకు చెందిన యువకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఆ పెట్రోల్ బంకులో ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.200 పెట్రోల్ కొట్టించాడు. కొద్దిదూరం వెళ్లేసరికి వాహనం ఆగిపోయింది. అనుమానం వచ్చి ఖాళీవాటర్ బాటిల్‌లో ట్యాంకులో ఉన్న పెట్రోల్ పట్టగా.. పావులీటరు కూడా పెట్రోల్ లేదని, ఎక్కువ మొత్తంలో నీరే ఉన్నట్టు గుర్తించాడు. దీంతో ఆ గ్రామానికి చెందిన మరికొంత మందితో ఆ వ్యక్తి పెట్రోల్ బంకు వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బంకు వద్దకు చేరుకుని ఆందోళనపై ఆరా తీశారు. ఇక్కడి బంకులో తరుచూ పెట్రోల్ కల్తీ జరుగుతుందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు.

ఆరోగ్య బీమా నిర్ణయం చాలా గొప్పది

పలాస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్ ఆరోగ్య బీమాకు కొత్త రూపు ఇచ్చి రూ.25 లక్షల వరకూ ఒక్కొక్కరిపై ఖర్చు చేయడానికి తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద రాష్ట్రంలో ఉన్న 1.60 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యం ప్రసాదించడానికి 2500 నెట్‌వర్క్ ఆసుపత్రిలో 25 లక్షల వరకూ ఆరోగ్యబీమా వర్తించేలా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా వెసులుబాటు లభించిందన్నారు. అదేవిధ ంగా సోషల్ మీడియాలో అరాచకశక్తులు చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని నియంత్రించడానికి కొత్త చట్టం తీసుకురవాలని నిర్ణయం తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైనేజీ లేక భవానీనగర్ వాసుల అవస్థలు



రోడ్డుపై చేరిన మురుగునీరు

టెక్కలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ భవానీనగర్ రెండో లైన్‌లో పూర్తిస్థాయిలో డ్రైనేజీ లేక వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో ఆ ప్రాంత వాసులు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల చుట్టూ మురుగునీరు చేరడం, పాములు బెడద నెలకొన్నాయని భవానీనగర్ వాసులు వాపోతున్నారు. ఎప్పుడు చినుకులు పడినా మా రోడ్డుపై ఇలానే మురుగు చేరుతుందని వాపోయారు. ఈ ప్రాంతానికి డ్రైనేజీ సౌకర్యం కల్పించి మురుగునీరు నిల్వల లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

నందిగాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం గురువారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. వ్యవసాయంపై జరిగిన చర్చలో ఎరువులపై సభ్యులు ప్రశ్నించారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారని వై.చక్రవర్తి, పి.ఆశారాణి, మోహనరావు, తరుణమ్మ, టి.రాజు తదితరులు సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో కుమార్‌పట్నాయక్, ఉపాధ్యక్షులు ఎస్.వసంతకుమార్, ఆర్.లక్ష్మీకాంతం, ప్రత్యేకాహ్వానితులు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల హల్‌చల్

● పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు



హిరమండలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సుబలయి ఆర్ఆర్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. రాత్రయితే సరి మందుబాబులకు అడ్డాగా మారిపోతుంది. మద్యం సీసాలతో పాటు పాన్‌పరాగ్, గుట్కా తదిదర మత్తు పదార్థాలు సేవించి అక్కడే విడిచిపెడుతున్నారు. దీంతో ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల గాంధీ విగ్రహం, పాఠశాల బోర్డు ధ్వంసం చేశారు. ఇప్పుడు బుధవారం రాత్రి కూడా పాఠశాల తరగతి గదులు బయట మద్యం ఖాళీ సీసాలు, ఖైనీ ప్యాకెట్లు ఉండడంతో హెచ్ఎం సాహూ పోలీసులకు ఫిర్యాద చేశారు. దీంతో కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాదరావు గురువారం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ఆకతాయిలపై నిఘా పెట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఢీకొని వ్యక్తి గాయాలపాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాజాం మండలం లోలుగు కంచరాం గ్రామానికి చెందిన గుణుపూర్ శంకరరావు (52) చికిత్స నిమిత్తం గురువారం ఉదయం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి వచ్చాడు. మందులు తీసుకొని తిరిగి వెళ్లేందుకు నడుచుకొని వస్తుండగా టెక్కలి నుంచి విశాఖ వెళుతూ.. శ్రీకాకుళం కాంప్లెక్స్‌లోకి వస్తూ మలుపు వద్ద తిరిగే సమయంలో శంకరరావు కాళ్లపై బస్సు ముందు చక్రం ఎక్కడంతో కుడి కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

విద్యుత్తు ప్రమాదంలో యువకుడికి..

మెళియాపుట్టి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీడిపాలెం గ్రామానికి చెందిన సవర భాస్కరరావు(30) గురువారం విద్యుత్తు ప్రమాదంలో గాయపడ్డాడు. తన ఇంటికి విద్యుత్తు సరఫరా లేకపోవడంతో సర్వీస్ వైర్ కదపడానికి విద్యుత్తు స్తంభం ఎక్కాడు. అయితే ఈ విద్యుత్తు లైన్‌పై నుంచే మెయిన్ లైన్ వెళ్తుండడంతో ప్రమాదవశాత్తు భాస్కరరావు విద్యుత్తు షాక్‌కు గురై కిందకి పడిపోవడంతో గాయపడ్డాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

యాదవ సంఘ అధ్యక్షుడిగా సోమేష్ యాదవ్

టెక్కలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడిగా నూనెల సోమేష్ యాదవ్‌ను నియమించినట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గురునాథ్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సోమేష్‌కు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సోమేష్ యాదవ్‌ను యాదవ సంఘ ప్రతినిధులు అభినందించారు. ఈయనతో పాటు జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ ఉన్నారు.

నేడు ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

పలాస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈద్‌మిలాద్ పండుగ ప్రభుత్వ సెలవు దినం కావడంతో శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు చేసినట్టు గురువారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడానికి రావద్దని ఈ సందర్భంగా కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బగాది



టెక్కలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి నియో జకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ మండల అధ్యక్ష పదవి బగాది శేషగిరికి వరించింది. ఈయన 2017 నుంచి టీడీపీ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఈయనపై 13 కేసులు పెట్టారు. ఈయన భార్య రమాదేవి రాధావల్లభాపురం గ్రామానికి రెండుసార్లు సర్పంచ్‌గా వ్యవహరించారు. కాళింగ సామాజిక వర్గానికి చెందిన శేషగిరి 2010 జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేశారు. శేషగిరి నియామకం పై కార్యకర్తలు, అభిమానులు హర్షవ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వపరంగా నిర్వహించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రీముఖలింగ క్షేత్రంలో ఏటా కార్తీక పౌర్ణమి రోజును నిర్వహించే బాలియాత్రను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాళింగ కార్పొరేషన్ రాష్ట్ర బోర్డు సభ్యులు నిర్ణయించారు. ఈమేరకు విజయవాడలో గురువారం కార్పొరేషన్ అధ్యక్షులు రోణంకి కృష్ణంనాయుడు ఆధ్వర్యంలో బీసీ శాఖ అధికారులు, జాయింట్ మేనేజర్ ఉమాదేవి ఆధ్వర్యంలో కాళింగ కార్పొరేషన్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 12 ప్రధాన అంశాలతో కూడిన అజెండాను ప్రభుత్వ దృష్టిలో పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సభ్యులు బార్ల చిన్నబాబు, అట్టాడ రవిబాబ్జీ, దుర్యోధనరావు, సనపల వరప్రసాద్, మామిడి దుర్గారావు, మొజ్జాడ నాగరాజు, నాంబాడి సీతారామాంజనేయులు పాల్గొనట్ల చెప్పారు.

పనులు వేగవంతం చేయాలి

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలీసు ఔట్‌పోస్టు భవన పనులు వేగవంతం చేయాలని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఔట్‌పోస్టును ప్రారంభిస్తే మండల ప్రజలు సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన పని ఉండదన్నారు.

ఘనంగా దీపోత్సవం



వీధిలో దీపాలతో..

పొందూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని కనకల వీధిలో దీపారాధాన నిర్వహించారు. శివలింగంతో పాటు వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పాలఖండ్యాంలో నిమజ్జనం

జి.సిగడాం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం కూడలిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గణనాథుని విగ్రహాన్ని గ్రామంలో మేళతాళాలు, నృత్యాలు, భారీ బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించి గ్రామ శివారులో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు.

సింహాద్రి అప్పన్న రూపంలో..



పూజలందుకుంటున్న సింహాద్రి అప్పన్న రూపంలో గణనాథుడు

కంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బూరగాంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బూరగాం-సోంపేట మార్గంలో సింహాద్రి అప్పన్న రూపంలో గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు, నిర్వాహకులు విశేష కార్యక్రమాలు నిర్వహించారు.

చినమురపాకలో హోమం..

లావేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చినమురపాకలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం హోమం, ప్రత్యేక పూజలు చేప ట్టారు. ఈ పూజల్లో చినమురపాక, మురపాక, చిత్రిపేట, గొల్లపేట తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. రాత్రి భజన చేపట్టారు.

లడ్డూ వేలం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెల్లుపడ వీధిలో గణనాథుని మండపంలో గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఏఎస్ఐ పోతల అప్పలరెడ్డి రూ.16500కు లడ్డూను సొంతం చేసుకున్నారు.

అలరించిన నాట్య ప్రదర్శనలు

కవిటి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల సందర్భంగా మాణిక్యపురంలో బుధవారం రాత్రి నిర్వహించిన నాట్య ప్రదర్శనలు అలరించాయి. ఇచ్ఛాపురానికి చెందిన కళాకారులు భరత నాట్యంతోపాటు ఒరియా సంబల్పూరి, జానపద నృత్యాలను చేశారు. 25మంది చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకర్షించాయి. కళాకారులను ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు.

గరికిపాలెంలో సామూహిక పూజలు

రణస్థలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గరికిపాలేం సినిమా థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మందిరం వద్ద హైపర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మేడూరి బాలకృష్ణ శర్మ, శివ సమక్షంలో మహిళలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

పరిశ్రమలకు వెళ్లే వాహనాల అడ్డగింత

రణస్థలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పిషిని పంచాయతీ పరిధిలో ఉన్న వీకేటీ, భారత్ గ్యాస్, ప్లేవుడ్ పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలను గురువారం గ్రామ స్థులు అడ్డుకున్నారు. ఈ పరిశ్ర మలకు సంబంధించిన భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు పూర్తిగా పాడైందని, భారీ గుంతలు ఏర్పడంతో ప్రమాదాలు జరుగు తున్నాయని స్థానిక యువకులు ఆవే దన వ్యక్తంచేశారు. రోడ్డు బాగు చేయాలని పలుమార్లు పరిశ్రమల యాజ మాన్యాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. భారీ వాహనాలు ఈ రోడ్డులోకి వస్తే అడ్డగిస్తా మని వారు స్పష్టం చేశారు.

పశువుల తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పశువులను వాహనంలో తరలిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో రోడ్లపై యధేచ్ఛగా తిరుగు తున్న పశువులను కార్పొరేషన్ అధికారులు పట్టుకుని చేసుకుని వాహనంలో తరలించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇది రోడ్డా.. పశువుల కొట్టమా?' శీర్షికతో వచ్చిన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి సమయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చిన్నబజార్ రోడ్డుపై ఉన్న పశువులను వాహనంలో ఖాజీపేటలో ఉన్న పశువులశాలకు తరలించారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుని



స్టవ్ కప్పు ఇరుక్కున్న కుక్క

కంచిలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఎరక్కపోయి వచ్చింది.. ఇరుక్కుపోయింది' ఓ శునకం.. గురువారం జలంత్రకోటలో ఓ ఇంటిలోని గ్యాస్ స్టౌవ్ ప్లేట్‌లో తలదూర్చడంతో అందులో తల ఇరుక్కుంది.. ఆ ప్లేట్ బయటకు రాకపోవడంతో అరుస్తూ గ్రామమంతా తిరిగింది. అయ్యో పాపమని దీనిని తీసేందుకు పలువురు స్థానికులు ప్రయత్నించగా బిగ్గరగా అరుస్తూ కరిచేందుకు ప్రయత్నించడంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

రణస్థలం రైతులకే యూరియా అందజేయాలి

రణస్థలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రణస్థలం మండల పరిధిలో ఉన్న రైతులకు మాత్రమే యూరియా విక్రయించాలని ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అన్నారు. గురువారం డీజీఎం ఎరువుల షాపును తనిఖీ చేశారు. ఇతర ఎరువులను ముడిపెట్టి యూరియాని విక్రయించవద్దన్నారు. రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరించడం జరుగుతుందన్నారు. జేఆర్‌పురం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సోంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకును పరిశీలించి బ్లాక్‌లో అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ సీఐ సతీష్, తహసీల్దార్ అప్పలస్వామి, ఏవో బి.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ పీవోకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ముకుందరావు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుందరావు దక్షిణాది ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల సంఘం ఉత్తమ జాతీయ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు గుంటూరులో గురువారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డు-2025ను అందజేశారు. ముకుందరావుకు అవార్డుపై క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ తదితరులు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

మైనర్ ఇరిగేషన్‌పై దృష్టి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్వహణ, యూరియా లభ్యత, సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులు, భూ సమస్యలు, స్వచ్ఛాంధ్ర అవార్డులు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్ ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర అవార్డుల సాధనకు కృషి కొనసాగుతోందని వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్యశాఖలో స్వచ్ఛాంధ్ర అవార్డులకు ఎంపిక చేసిన జాబితాలను అందజేయాలన్నారు. పంచాయతీ స్థాయిలో కూడా అవార్డులకు జాబితాను అందించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు డస్ట్‌బిన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీని ఆదేశించారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాగ్రత్తలు తీసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాగ్రత్త తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ అధికారులతో వివిధ సమస్యలపై గురువారం జడ్పీ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. లేదంటే భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సక్రమంగా రిపోర్టును అందజేయాలని వీఆర్వోలను ఆదేశించారు. మండలాల వారీగా భూ సమస్యలు, కోర్టు కేసులు, గ్రీవెన్స్, సర్వే సర్టిఫికెట్లు జారీ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్ జయదేవి తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో చిక్కుకున్న వారిని తీసుకురండి

- ఎమ్మెల్యే అశోక్‌కి బాధితుల కుటుంబ సభ్యుల మొర



బాధితులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అక్కడ చిక్కుకున్న కుటుంబ సభ్యులను తీసుకువచ్చేందుకు కృషి చేయాలని బాధితుల కుటుంబ సభ్యులు వేడుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను గురువారం రామయ్యపుట్టుగలో కలిసి విన్నవించారు. ఆరునెలల కిందట స్థానికంగా ఉపాధి లేక కుటుంబాల పోషణ కోసం స్థానికంగా ఉన్న ఏజెంటు ద్వారా కవిటి గ్రామానికి చెందిన పొల్లాయి చిరంజీవి, సన్నిధి కోదండస్వామి దుబాయ్ వెళ్లారని, అయితే అక్కడ మూడు నెలలుగా తిండి లేక బాధపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆరు నెలల కిందట ఏజెంటు ద్వారా దుబాయ్‌లోని సిల్సిలా గ్రూప్‌లో పనులు చేసేం దుకు వెళ్లారని, అయితే మూడు నెలలు పనులు సక్రమంగా చేసిన తరువాత సమస్య ఏర్పడిందన్నారు. గత మూడు నెల లుగా వేతనాలు ఇవ్వడం లేదని, తమను బంధించారని బాధితులు మా దృష్టికి తీసుకు వచ్చారని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ఎమ్మెల్యే బి.అశోక్ వెంటనే బాధితులతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి వివరాలు తెలియజేస్తే స్వదేశానికి తీసు కువచ్చేందుకు ప్రయత్ని స్తానని భరోసా ఇచ్చారు.

అవసరం మేరకు యూరియా ఇవ్వరా?

- పంపిణీ కేంద్రం వద్ద రైతుల ఆందోళన



కొత్తకోట ఎరువుల కోసం గుమిగూడిన రైతులు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు యూరియా ఇవ్వండి.. లేకుంటే బ్లాకులో మీరే అమ్ముకోవాలని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్తకోట రైతు సేవా కేంద్రం వద్ద ఐదు గ్రామాల రైతులకు ఎరువులు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గంటల తరబడి క్యూలో ఉంచి ఆ తరువాత ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తామని సిబ్బంది చెప్ప డంతో రైతులు ఆగ్రహం చెందారు. ఒక బస్తా ఏ మేరకు ఉపయోగపడుతుందని అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో చాలాసేపు ఎరువులను పంపిణీ చేపట్టకపోవ డంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులతో వాగ్వా దానికి దిగారు. అక్కడ గందరగోళ పరిస్థితులు ఏర్పడడంతో పోలీసులు రంగప్ర వేశం చేసి రైతులకు నచ్చజెప్పారు. కూటమి నేతలకు సంబంధించిన రైతులకు ఎటువంటి పరిమితి లేకుండా ఎరువులు అధికారులు ఇస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు.

ఆలయాల పాలకమండళ్ల ప్రమాణ స్వీకారం



కోదండరామాలయం కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం/అరసవల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు దేవాలయాలకు ప్రభుత్వం నియమించిన పాలక మండళ్ల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం నిర్వహించారు. పాలకొండరోడ్డులోని కోదండ రామాలయం, చిన్నబజార్ వేంకటేశ్వరాలయం, తుమ్మావీధి నరసింహ స్వామి ఆలయం, కొన్నవీధి భీమేశ్వరాలయాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడుతూ.. ఆలయాలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయాలని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఈవోలు సర్వేశ్వరరావు, గంగాభవాని, ఆయా ఆలయాల అర్చకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాల స్వాధీనం

రణస్థలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీతంవలస గ్రామ సమీపంలో ఉన్న కొండ నుంచి బుధవారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. ఒక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఎస్. కిరణ్ కుమార్ తెలిపారు. గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

గార రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో అతిపెద్ద మత్స్యకార గ్రామం బందరు వానిపేటలో సీసీ కెమెరాలను ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాలను గ్రామంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేశామన్నారు. తీరప్రాంతంగుండా గుర్తుతెలియని వ్యక్తుల చొరబాటు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయన్నారు.

బట్టీ విధానానికి స్వస్తి..

(మూడో పేజీ తరువాయి)

వస్తువులతో బోధనోపకరణాలు తయారుచేసి వాటికి సృజనాత్మకత జోడించి కొత్త ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని రుజువు చేశారు. వర్ణమాల మొదలు ఆంగ్లవ్యాకరణం, గణిత ప్రక్రియ మానవశరీర భాగాలు, పర్యావరణం, అనేక అంశాలలో బోధనోపకరణాలు రూపొందించారు.

- ఈమె ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర వృత్తి శిక్షణలో కేఆర్‌పీగా, తెలుగు మాడ్యూల్ రైటర్‌గా వ్యవహరించారు. మోడల్ లైబ్రరీ శిక్షణలో, జాతీయస్థాయి బొమ్మల ఆధారిత బోధనలో, రాష్ట్రస్థాయి శిక్షణలో పాల్గొన్నారు. ఫ్రూట్స్ బృందంలో, ఫ్రూట్స్ ఈ మ్యాగజైన్‌లో 2020 నుంచీ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. ఏపీ-ఈ పాఠశాల, డీటీహెచ్ సేవలు, దీక్షా యాప్ ఈ- కంటెంట్ క్రియేటింగ్ పాఠం ఆమె అవలీలగా సృష్టించారు. పిల్లల కోసం నిర్వహించిన యూట్యూబ్ ఛానల్, వ్యక్తిగత కంటెంట్, టీఎల్ఎం, క్రాఫ్టలను 2,29,589 మంది వీక్షించారు. పాఠశాలలో చేరిన వారి కోసం నిర్వహించిన సామాజిక ప్రేరణ కార్యక్రమాలు, పీటీఏ సమావేశాలు, ఏఎంసీ, పీఎంసీ ప్రత్యేక డ్రైవ్‌లో కీలకపాత్ర పోషించారు. 2023లో మ్యాజిక్ ఆఫ్ రికార్డు ద్వారా ఢిల్లీ నుంచి గౌరవ డాక్టరేట్, 2023లో విశాఖపట్నం సెయింట్ పాల్ విశ్వవిద్యాలయంలో అవార్డు సొంతం చేసుకున్నారు. 2023లో గుంటూరులో తెలుగు బాలోత్సవ్‌లో పాల్గొన్నారు. 2024లో విజయవాడలో రాష్ట్రస్థాయి కేఆర్‌పీగా వ్యవహరించారు. జిల్లా ఎఫ్ఎల్ఎన్‌లో శిక్షకులు, వివిధ ఎన్జీవోల నుంచి అవార్డులు పొందారు. పాఠశాల విద్యార్థులతో కలిసి రాష్ట్రస్థాయి సంకలనంలో 3వ స్థానంలో నిలిచారు. ఈమెకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై ఎంఈవోలు అరసాడ రవి, మొండి శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

- **ఆనందంగా ఉంది..**

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డుకి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. గతంలో జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయిలలో వివిధ అంశాలపై పలు అవార్డులను, డాక్టరేట్లను పొందాను. విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంచడానికి చిత్రలేఖనం, పుస్తకపఠనం, పుస్తక సమీక్షలు చేయిస్తున్నాం. సీతాకోకచిలుక ఆకారంలో లైబ్రరీ పుస్తకాలను ఏర్పాటు చేసి ఆర్ట్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నాం. టీఎల్ఎం కార్నర్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆకర్షణీయమైన బోధనోపకరణాలు ఏర్పాటు చేశాం.

-కూర్మాన అరుణకుమారి, హెచ్ఎం, బూటుపేట

సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకుని అధ్యాపకులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో గురువారం సర్వేపల్లి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ భాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్‌గా పద్మ



లావేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్‌గా నిడిగంట్ల పద్మ (టీడీపీ)ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమెకు ఏఎంసీ చైర్మన్‌గా నియమించడంపై టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఐ.తోటయ్యదొర, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.దామోదరరావు, టీడీపీ నాయకులు పిన్నింటి మధుబాబు తదితరులు అభినందించారు.

అవినీతి రహిత పాలనే లక్ష్యం

కంచిలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి రహిత పాలనే లక్ష్యంగా కూటమి ప్రభు త్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. శాసనాంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నేతలు మాదిన రామారావు, బంగారు కురయ్య, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీ డీవో వి.తిరుమలరావు, ఎస్ఐ పి.పారినాయిడు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎస్ రాష్ట్ర డైరెక్టర్‌గా ప్రత్తిపాటి

సరుబుజ్జిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ రైట్ ప్రొటెక్షన్ సమితి (సీఆర్‌పీఎస్) రాష్ట్ర డైరెక్టర్‌గా నందికొండ కాలనీకి చెందిన జిల్లా క్రైస్తవ మ్యారేజ్ రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు ఎంపి కయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ చైర్మన్ ఆమోస్ జేమ్స్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు. పలువురు అభినందించారు.

న్యూస్ బాక్స్

నాటక అకాడమీ డైరెక్టర్‌గా కామేశ్వరరావు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా నీలాపుపుట్టుగ గ్రామానికి చెందిన దక్కత కామేశ్వరరావు నియమితుల య్యారు. నియామక ఉత్తర్వులు వచ్చాయి.

'లైవ్‌స్టాక్' కార్పొరేషన్‌కు పూర్ణ

కంచిలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్‌గా తలతంపర గ్రామానికి చెందిన మర్రిపాటి పూర్ణచంద్రుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్, నేతలు అభినందించారు.

అంధకారంలో రిమ్స్ కళాశాల

శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో ప్రభుత(రిమ్స్) వైద్య కళాశా లలో గురువారం రాత్రి అంధకారం నెలకొంది. రాత్రి 7 గంటల నుంచి విద్యుత్ నిలిచిపోయింది. 9.40 గంటలైనా విద్యుత్ అధికారులు స్పందించలేదు. దీంతో కళాశాల విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తరచూ ఇటువంటి సంఘటనలు జరుగుతుండడంపై వైద్య విద్యార్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల గేటు వద్ద నుంచి చిమ్మ చీకట్లు కమ్ముకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కన్నతండ్రే కాలయముడు




హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో అర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో అర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

మా మంచి మాస్టార్లు

- బోధనలో ఆ ఉపాధ్యాయులది ప్రత్యేక శైలి
- అంకితభావంతో గుర్తింపు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సమాజంలో ఉపాధ్యాయుడిది ప్రత్యేక స్థానం. ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం. తమదైన బోధనా తీరుతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ... ఇటు తల్లిదండ్రుల ప్రశంసలు.. అటు ప్రభుత్వ పురస్కారాలు అందుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. కొందరికి అవార్డులు.. రివార్డులు రాకపోయినా.. సేవల్లో మాత్రం ముందు వరుసలో ఉంటున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొందరు గురువుల గురించి తెలుసుకుందాం.

అ'విశ్రాంత' ఉపాధ్యాయుడు నారాయణరావు



నారాయణరావు

గార రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గార మండలం కళింగపట్నం పంచాయతీ పెద్దపల్లిపేటకు చెందిన బి.వి.నారాయణరావు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఆయన ఉపాధ్యాయునిగా ఎక్కువ కాలం అక్కడే పనిచేసి...ఉద్యోగ విరమణ చేశారు. బోధనపై ఉన్న మక్కువతో ఉద్యోగ విరమణ చేసినప్పటికీ... ఆ పాఠశాల విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్ పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ఉద్యోగ విరమణ అనేది వయస్సుకు సంబంధించినదే కానీ వృత్తికి కాదని చెబుతున్నారు ఈ మాస్టారు.

సేవలతోనే 'ఉత్తమం'గా...



టీఎల్ఎం ఉపయోగించి పాఠాలు చెబుతూ...

హరిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన గున్న రాజు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు. పెద్దలింబుగాం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్నారు. ఆయన బోధనలో ప్రత్యేకత చూపించడమే కాదు..పాఠశాల అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల చేరికతోపాటు బోధన, మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసింది. పాఠశాలను నాడు-నేడు పథకానికి ముందే సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాల ఆధునీకీకరణకు మొదటిగా తానే రూ.20 వేలు అందజేశారు. తల్లిదండ్రుల సహకారంతో కాంపౌండ్‌వాల్, ముఖద్వారం నిర్మించారు. తాగునీరు, మరుగుదొడ్లకు పైప్‌లైన్లు వేయించారు. 2022లో ఆయన ఆ పాఠశాలలో బాధ్యతలు చేపట్టే నాటికి విద్యార్థుల సంఖ్య 22. ప్రస్తుతం ఈ సంఖ్య 81కి చేరింది. రోజూ ఒక గంట అదనపు సమయం వెచ్చించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు తర్ఫీదునిస్తున్నారు.

'ఆదర్శ'ంగా నిలుస్తున్న రామారావు...



మెండ రామారావు

జలుమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడే ఉపాధ్యాయుడు మెండ రామారావు. ప్రస్తుతం జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. తన ఇద్దరు పిల్లలను కూడా జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదివిస్తున్నారు. ఈ క్రమంలో గత ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. ఉదయం 8.30 గంటలకే పాఠశాలకు హాజరై.. సాయంత్రం 5.30 గంటల వరకు పిల్లల కోసమే సమయం కేటాయిస్తున్నారు. పాఠశాల ఆవరణలో క్రీడామైదానం తయారు చేయించి... పిల్లలు ఆడుకోడానికి పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ... శ్రద్ధ కనబరుస్తున్నారు. వేసవి సెలవుల్లో రోజు తప్పించి రోజు పిల్లల ఇళ్లకు వెళ్లి... వారి సందేహాలు నివృత్తి చేస్తుంటారు. ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి... పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులను వారికి అందిస్తున్నారు. రెండేళ్ల క్రితం 9 మందితో నడిచిన పాఠశాల ప్రస్తుతం 86 మంది పిల్లలతో కళకళలాడుతోంది. ఇద్దరు ఉపాధ్యాయులతో నడిచిన ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం ఐదుగురు టీచర్లు ఉన్నారు.

పేద పిల్లల వైద్యానికీ సాయం...



విద్యార్థులకు టీఎల్ఎంతో బోధిస్తున్న రాజేంద్రబాబు

కంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జి.రాజేంద్రబాబు, చంద్రుపట్టుగ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య జి.మీనా తమదైన శైలిలో బోధిస్తూ... విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు అందుకుంటున్నారు. తాము ఎక్కడ పని చేసినా... అక్కడి విద్యార్థులతో మమేకమై బోధన సాగించడం వారి ప్రత్యేకత. తమ వేతనాల నుంచి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి అవసరమైన ఖర్చులు చేయడం వారి ఉదారతకు నిదర్శనంగా చెబుతారు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం లేనివిధంగా అన్ని రకాల టీఎల్ఎమ్ (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ను వారే సొంతంగా తయారు చేస్తూ, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తుంటారు. తక్కువ సమయంలోనే అటు విద్యార్థుల అభిమానం, ఇటు తల్లిదండ్రులు, గ్రామస్థుల ఆదరణను పొందారు. పేద పిల్లల పుట్టిన రోజు వేడుకలను తమ సొంత డబ్బులతో నిర్వహిస్తారు. వివిధ పండుగలకు తమ సొంత డబ్బులతో పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తుంటారు. అంతేకాకుండా విద్యార్థులు అనారోగ్యం పాలైతే తామే ఖర్చులు భరించి... వైద్య సేవలు అందిస్తున్నారు ఈ ఉపాధ్యాయ దంపతులు.



విద్యార్థికి వ్యక్తిగతంగా బోధిస్తూ...

పాఠశాల రూపురేఖలు మార్చి...



వాతావరణ మార్పులపై టీఎల్ఎంతో వివరిస్తున్న ముకుందరావు

కంచిలి రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న సామంత రామచంద్రపురం గ్రామస్థులు అధికశాతం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతుండేవారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో సరిగా బోధించరు' అనేది వారి అభిప్రాయం. కానీ హెచ్ఎం దీవెన రాణి సహకారంతో కొత్తగా వచ్చిన పొల్లాయి ముకుందరావు పాఠశాల రూపు రేఖలనే కాకుండా, ఆ ఊరి పాఠశాలపై గ్రామస్థుల్లో ఉన్న అభిప్రాయాలను మార్చేశారు. దాతలతో మాట్లాడి విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులు ఇప్పించడం... ప్రత్యేకమైన తరహాలో బోధనచేస్తూ... విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించడంతో మాస్టారి బోధనపై స్థానికుల్లో మంచి అభిప్రాయం ఏర్పడింది. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలు మాన్పించి.. గ్రామంలోని పాఠశాలలో చేర్పించారు. ప్రత్యేకంగా టీఎల్ఎం సిద్ధం చేసి, సామూహికం గానూ, వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ బోధిస్తుండడంతో ఆయనను విద్యార్థులలో ప్రత్యేకంగా నిలిపింది. దీంతో గత ఏడాది 36 ఉన్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 49 మందికి చేరింది.

'నవోదయ'లో చేరాలంటే...



రవి

కంచిలి మండలంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులు నవోదయ, ఎన్ఎంఎంఎస్ వంటి పోటీ పరీక్షలు రాయాలంటే ఠక్కున గుర్తుకు వచ్చే పేరు నల్లాన రవి మాస్టారు. ప్రస్తుతం ఆయన పురుషోత్తపురం పాఠశాలలో పని చేస్తున్నారు. గతంలో కంచిలి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏటా తమ పాఠశాల నుంచి ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు నవోదయ ప్రవేశాలు పొందేలా తర్ఫీదు ఇచ్చారు. ఇప్పుడూ అదే బాటలో నడుస్తున్నారు. బోధనపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తూ.. విద్యార్థులను చిన్నతనం నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం కోసం సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. ఒక్కోసారి రాత్రి 7 గంటల వరకు బోధిస్తూ... పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తుంటా రు. సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. గత ఎనిమిదేళ్లుగా ఆయన శిక్షణ ఇస్తున్న విద్యార్థులు నవోదయకు ఎంపికవుతుండడం విశేషం.

టీఎల్ఎంలు ఆమె ప్రత్యేకత...



బొమ్మలతో అక్షరాలు, పదాలు నేర్పిస్తున్న మాధవి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా బోధన సాగించేందుకు తన వేతనంలో కొంత మొత్తాన్ని వెచ్చిస్తూ..ప్రత్యేకంగా టీఎల్ఎంలు రూపొందిస్తూ... విద్యార్థుల అభిమానాన్ని చూరగొంటున్నారు మఖరాంపురం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని మాధవి బెహరా. విద్యార్థుల బోధనకు అవసరమైన అన్ని టీఎల్ఎం వస్తువులను తన సొంత ఖర్చులతో తయారు చేయించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడమే కాకుండా కృత్యాలు.. బొమ్మల ద్వారా అక్షరాలను నేర్పిస్తూ.. చిన్నారులకు ఇష్టమైన ఉపాధ్యాయురాలిగా మారారు.

సృజనాత్మకతను పెంచేందుకు...



అబ్దుల్‌కలాంకు సైన్స్ ప్రయోగాలను వివరిస్తున్న శ్రీనివాసరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నారు నగరంపల్లి హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు. విద్యార్థులను పంట పొలాలకు తీసుకు వెళ్లి సేద్యాన్ని ప్రత్యక్షంగా చూపిస్తారు. వారితోనే వరి నాట్లు వేయిస్తారు. తీర ప్రాంతంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రాలకు తీసుకెళ్లి... జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తారు. ప్రతి విద్యార్థి తన పుట్టిన రోజున పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేలా ప్రేరణ కలిగిస్తున్నారు. తన కృషితో దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి ప్రశంసలు అందుకున్నారు.

పాఠాలకు నాటకీయత జోడించి...



వివిధ వేషాలతో విద్యార్థులకు బోధిస్తున్న షణ్ముఖరావు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పాఠాలు సులువుగా అర్థం కావాలంటే.. ఆ అంశాలు వారితో చెప్పించాలి. మాట్లాడించాలి. అవసరమైతే నాటకంలా మలచాలి అంటారు...అదే తన బోధనలో ఆచరిస్తారు షణ్ముఖరావు మాస్టారు. కొత్తపల్లి పాఠశాలలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆంగ్లం పలకడమే కష్టమైన గ్రామీణ పిల్లలతో వివిధ కార్యకలాపాల ద్వారా ఆ భాష పట్ల మక్కువ పెంచుతున్నారు. ఆట, పాట, మాట, నటన, బొమ్మలు గీయడం వంటి కృత్యాలతో పాఠాల పట్ల పిల్లలకు ఆసక్తి కలిగిస్తున్నారు. తాను పనిచేసే పాఠశాలలు, అక్కడి పిల్లల అవసరాలు తీర్చడానికి వేలాది రూపాయలు సొంతంగా ఖర్చు చేస్తుంటారు. ఏటా 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తుంటారు. పేద విద్యార్థులకు ఆ పరీక్షకు సంబంధించిన ఫీజులు కూడా తనే చెల్లిస్తుంటారు. అనారోగ్యం పాలైన విద్యార్థుల వైద్య ఖర్చులకూ సాయం అందిస్తున్నారు.